# ఈవీఎంలను సిద్ధం చేయాలి

**కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**


ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్,ఫిబ్రవరి 5 : రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఈబీఎం గోదాంను జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఈవీఎం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఈసీఎల్ ఇంజినీర్ల సాయంతో పరికరాలన్నీ పనిచేసే విధంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నగేశ్

# విద్యతోనే అభివృద్ధి సాధ్యం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 5 : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని భారత యాదవ సమితి రాష్ట్ర అధక్షుడు దాసరి నగేశ్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మంచిర్యాల జిల్లా యాదవ సమితి ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేశ్ యాదవ్, కార్యదర్శి బుక్కరాజు తిరుపతి, జిల్లా అధ్యక్షుడు గొర్ర తిరుపతితో కలిసి మాట్లాడారు. యాదవుల్లో రాజకీయ చైతన్యం రావాలని, రాజ్యాధికారంతోనే సామాజిక వర్గం అభ్యున్నతి చెందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారత యాదవ సమితి మంచిర్యాల గౌరవ అధ్యక్షుడు గంగన్న యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందినేని సతీశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు చిలుముల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి ముస్కె రవికిరణ్, సలహాదారు రవీందర్,నాయకులు శ్రావణ్, మోహన్, రమేశ్, సంతోష్, రాంచందర్, సంగ రవి, అనిల్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టాలి

## రెండు నెలల్లోనే ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 5 : ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బ కొట్టాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో నిర్వహించిన మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని నమ్మి ప్రజలు ఆ పార్టీని గెలిపించారని, ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేలా దాకా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. 2014లో తెలంగాణ వచ్చేనాటికి టెన్త్, ఇంటర్ చదివే పిల్లలకు తెలంగాణ ఉద్యమ చరిత్ర అంతగా తెలియదని, వీళ్లంతా నేడు 25 నుంచి 35 ఏళ్ల వారయ్యారని, సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారమే ఎక్కువగా వీళ్లను ఆకర్షించిందని చెప్పుకొచ్చారు. కేవలం రెండు నెలల్లోనే కాంగ్రెస్ బండారం బయట పడిందని, ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, తప్పు చేశామన్న భావనలో వారు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం రాగానే ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడేమో మాట మారుస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మూడు రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ అధికారంలో ఉందని, మరి రాహుల్‌గాంధీని ఎలా ప్రధానమంత్రిని చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే అవసరం మాకు లేదని, హామీలిచ్చే ముందు ఆర్థిక స్థితిగతులు ఎందుకు చూసుకోలేదని, అప్పులు చేశారని పదేపదే చెబుతున్న మీరు.. ఈ 50 రోజుల్లో అప్పులు ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాకపోతే దిగిపోవాలని, సన్నాసులమని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. మంచిరోజులు మళ్లీ వస్తాయని, సమర్థవంతంమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, ప్రజాస్వామ్యం అంటే అధికారమే కాదు, ప్రతిపక్షం కూడా ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలను విశ్లేషించుకొని ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడిచిన పదేళ్లలో మనం చేసిన అభివృద్ధిని వివరిస్తూనే.. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కష్టపడి మన ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

### రేవంత్‌రెడ్డిని చెప్పుతో కొట్టాలి : బాల్క సుమన్

తెలంగాణను తెచ్చిన మహానాయకుడు, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను పట్టుకుని బుడ్డరఖాన్ రేవంత్ రెడ్డి ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నాడని, అతన్ని చెప్పుతో కొట్టాలని, కానీ సంస్కారం అడ్డు వచ్చి ఆ పని చేయడం లేదని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. ఓటమితో భయపడాల్సిన అవసరం లేదని, గులాబీ జెండా పుట్టిందే తెలంగాణ కోసమని, ప్రతిపక్షంలో ఉండి కూడా ప్రజల కోసం కొట్లాడటానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆ 420 హామీలు నెరవేర్చాలని, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి పదవిని బట్టి.. స్థాయిని బట్టి మాట్లాడాలన్నారు. ఉద్యమానికి వెన్నుపోటు పొడిచినా కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్షమించి వదిలేశామని, ప్రజాస్వామ్య స్ఫూర్తితో పద్ధతిగా పరిపాలన సాగించామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రేవంత్ రెడ్డి అహంకారంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, రైతుబంధు డబ్బులు అడిగితే కాంగ్రెస్ మంత్రులు రైతులను చెప్పుతో కొడతామంటున్నారని, ఆటో డ్రైవర్లు తిన్నది అరగక ధర్నాలు చేస్తున్నారని అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతుబంధు కోసం గత ప్రభుత్వంలో విడుదల చేసిన రూ. 7,700 కోట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి రాఘవ కన్‌స్ట్రక్షన్‌కి, కాంగ్రెస్ కాంట్రాక్టర్ల జేబుల్లోకి మలుపుకొని రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. పరిపాలన గాలికి వదిలేసి ఆస్తులు సంపాదించుకునే పనిలో పడ్డారని, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ ఖజానాపై గద్దల్లా వాలి దోచుకుతింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మరల్చడానికి కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నాయకులను తిడుతున్నారన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో కేంద్రంగానీ, పక్క రాష్ట్రాల వాళ్లు గానీ మన ప్రాజెక్టుల వైపు చూడాలంటేనే భయపడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల అధికారాలన్నీ కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోయాయని, సాగునీరు లేక రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించే దుస్థితి వచ్చిందని, పరిపాలన చేతకాక గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు వినోద్, వివేక్ ఇప్పుడు ఎమ్మెల్యేలు అయ్యారని, ఇప్పుడు వివేక్ కొడుకు వంశీకి ఎంపీ టికెట్ ఇవ్వాలని చూస్తున్నారని, ఇది కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


చెప్పు చూపెడుతున్న బాల్క సుమన్


సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

- కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకెళ్లాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్షలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- హామీలు నెరవేర్చడం చేతగాని ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్
- రేవంత్‌ను చెప్పుతో కొట్టాలి : సుమన్
- పార్లమెంటు ఎన్నికల్లో సత్తాచాటాలి : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- కార్యకర్తలందరికీ అండగా ఉంటాం : ఎమ్మెల్సీ దండె విఠల్

### పార్లమెంటు ఎన్నికల్లో సత్తాచాటాలి
### - మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకొని మన సత్తాను చాటుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. అబద్ధాలు, తప్పుడు ప్రచారాలతో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, మంచిర్యాలలో అయితే ఒక్కసారి అవకాశం ఇవ్వాలని బతిమిలాడుకుంటే ప్రజలు కనికరించారని, రెండునెలల్లోనే ఆ పార్టీ ఏమిటో ప్రజలకు అర్థమయ్యిందని, కేవలం మాటలు తప్ప చేతలు లేవని గమనించారని అన్నారు. చేసిన పనులను చెప్పుకోలేకపోయామని, ఇప్పటికైనా పదేళ్లలో మనం చేసిన పనులను గడపగడపకూ తీసుకెళ్లి ఎంపీ ఎన్నికల్లో గెలుపొందాలని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్సీ దండె విఠల్

బీఆర్ఎస్ కార్యకర్తలందరికీ అండగా ఉంటామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినంత మాత్రాన ఎవరూ కుంగిపోవద్దని, ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని కోరారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం కలిసికట్టుగా పనిచేయాలని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్థానికసంస్థల ఎన్నికలు వస్తాయని, వాటికోసం కూడా ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన పెంట రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, తిప్పని లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అత్తి సరోజ, పల్లె భూమేశ్, గోగుల రవీందర్‌రెడ్డి, సందెల వెంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు సన్మానం

సర్పంచులు, వార్డుమెంబర్లుగా పనిచేసి ఇటీవల పదవీకాలాన్ని పూర్తిచేసుకున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో సేవలందించిన వీరందరినీ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, బాల్క సుమన్ శాలువాలు కప్పి సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలంతా కృషిచేయాలని పిలుపునిచ్చారు.

### ఆటోడ్రైవర్లను ఆదుకునేలా ఒత్తిడి తేవాలని వినతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని, తమను ఆదుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన ఆటో డ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్ల బాధలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. గిరాకీలు లేక కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేదని, ఆటోలపై తీసుకున్న ఫైనాన్స్ కిస్తీలు కట్టలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నామని శంకరయ్య, పుల్ల సమ్మయ్య, దాసరి వెంకటేశ్, ప్రశాంత్, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

# కడుపు కోత.. కలెక్షన్ల మోత..

## ధనార్జనే ధ్యేయంగా కాన్పులు చేస్తున్న హాస్పిటల్స్‌పై ప్రభుత్వం సీరియస్

- సాధారణ ప్రసవాలకు అవకాశమున్నా.. సీ-సెక్షన్‌కే ప్రాధాన్యమిస్తున్నట్లు గుర్తింపు
- 70 శాతానికి మించి శస్త్రచికిత్సలు
- కేసీఆర్ సర్కారులోనే నోటీసులు
- మారని దవాఖానలను తనిఖీ చేయాలని నిర్ణయం
- మూడు ప్రత్యేక బృందాలతో నేటి నుంచి వివరాల సేకరణ

మంచిర్యాల ప్రతినిధి, (నమస్తే తెలంగాణ) /మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 5: మంచిర్యాల జిల్లాలో 'కడుపుకోత'లు జోరుగా సాగుతున్నాయి. కొన్ని ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు కాసుల కోసం కక్కుర్తి పడి సిజేరియన్లకు తెగబడుతున్నాయి. సాధారణ కాన్పులకు అవకాశమున్నా.. ఏదో ఒక సాకు చెబుతూ అందినకాడికి దండుకుంటున్నాయి. కేసీఆర్ సర్కారులో అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఈ అంశంపై సీరియస్ అయిన విషయం విదితమే. డీఎంహెచ్‌వో ఐదారునెలల క్రితమే జిల్లాలో అత్యధిక సీ-సెక్షన్ ఆపరేషన్లు చేస్తున్న దవాఖానల డాక్టర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అవసరం లేకున్నా సీ-సెక్షన్ చేస్తున్న 25 హాస్పిటల్స్‌ను గుర్తించి నోటీసులు ఇచ్చారు. దీంతో కొన్ని ఆసుపత్రులు ఆపరేషన్లను కాస్త తగ్గించాయి. కానీ జిల్లాలో టాప్ హాస్పిటల్స్‌గా చలామణి అవుతున్న కొన్ని మాత్రం తీరు మార్చుకోనట్లు తెలుస్తున్నది. ఈ హాస్పటల్స్‌లలో చేసే ప్రతి ఐదు ప్రసవాల్లో నాలుగు సీ-సెక్షన్ కేసులున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

**జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకు జరిగిన డెలివరీల వివరాలు**

| | ప్రభుత్వ దవాఖానలు | ప్రైవేట్ హాస్పిటల్స్ |
|---|---|---|
| నార్మల్ | 2451 | 477 |
| సిజేరియన్లు | 2560 | 3406 |
| మొత్తం | 5011 | 3883 |

### వైద్యారోగ్య శాఖ కమిషనర్ సీరియస్..

జిల్లాలో ప్రైవేట్ హాస్పిటల్స్‌లో జరుగుతున్న సిజేరియన్లపై వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణణ్ సీరియస్ అయ్యారు. మంచిర్యాల జిల్లా మొదటి కలెక్టర్‌గా పని చేసిన ఆయన గత నెలలో జిల్లాలో పర్యటించారు. ఆయన మాతాశిశు ఆసుపత్రిని సందర్శించి డెలివరీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ శాతం ప్రైవేట్‌కు వెళ్తున్నట్లు, అందులో సీ-సెక్షన్ కేసులు ఎక్కువ ఉన్నట్లు తెలియడంతో ఎందుకు ఇలా జరుగుతుందని అధికారులపై సీరియస్ అయ్యారు. అసలేం జరుగుతుంది, ఎక్కువగా సీ సెక్షన్లు ఎందుకు జరుగుతున్నాయో పూర్తి నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారాయుడిని ఆదేశించారు. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖ 14 ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు సేకరించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నేటి నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిసింది.

### భయపెట్టి కలెక్షన్లు..

జిల్లాలోని ప్రైవేటు హాస్పిటల్స్‌లో సాధారణ ప్రసవాలకు అవకాశమున్నా చేయడం లేదు. కడుపులో బిడ్డ ఉమ్మనీరు తాగిందని.. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని, లేదంటే తల్లీబిడ్డలకు ప్రమాదమని చెప్పి గర్భిణుల బంధువులను భయపెట్టేస్తున్నారు. వైద్యులు చెప్పినట్లు చేయకపోతే తల్లీబిడ్డకు ఏమవుతుందోనన్న ఆందోళనలో కుటుంబ సభ్యులు వారు చెప్పినట్లు నడుచుకుంటున్నారు. నార్మల్ డెలివరీ చేస్తే తక్కువ ఫీజు వస్తుందని, సిజేరియన్ అయితే ఎక్కువ సొమ్ము వసూలు చేయవచ్చని కొందరు వైద్యులు ఆపరేషన్లకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డెలివరీ డేట్‌కు.. ముహూర్తం చూసుకొని ఆపరేషన్‌కు రావాలని కొందరు వైద్యులు గర్భిణులకు చెబుతున్నట్లు తెలిసింది. ముహూర్తాల మోజులో కొందరు ఆపరేషనే చేయాలని వైద్యులను బలవంతం చేసేవారు సైతం ఉన్నప్పటికీ.. అలా డిమాండ్ చేస్తున్న వారికంటే భయపెట్టి ప్రసవాలు చేసే డాక్టర్లే ఎక్కువగా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో ప్రసవానికి రూ.50 వేల నుంచి రూ. 60 వేల వరకు తీసుకుంటుండగా, ముహూర్తం ఫిక్స్ చేసుకొని ఆపరేషన్ చేయాల్సి వస్తే అదనంగా రూ. 30వేల వరకు వసూలు చేస్తున్నారు.



### 14 ఆసుపత్రుల్లోనేనా..ఇంకా ఉన్నాయా..

జిల్లాలో మెత్తం ప్రసవాలు చేసే ప్రైవేటు ఆసుపత్రులు 26 ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువగా సిజేరియన్ డెలివరీలు చేస్తున్న 14 ఆసుపత్రులను వైద్యాధికారులు గుర్తించారు. వివరాల సేకరణకు ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక బృందాలు గుర్తించిన ఆసుపత్రుల గైనకాలజిస్టులను జిల్లా వైద్యాధికార్యాలయానికే పిలిపించుకొని పూర్తి వివరాలను, కేసీట్లను, ఇతర వివరాలను సేకరించనున్నట్లు సమాచారం. అనంతరం సేకరించిన వివరాల ప్రకారం ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయనున్నారు. అధికారులు ఆడిట్ చేయనున్న 14 ప్రైవేట్ ఆసుపత్రుల్లో శ్రీ సత్యసాయి, సంధ్య, శ్రీలత నర్సింగ్ హోమ్, బర్త్ రూట్స్, శ్రీ రామ నర్సింగ్ హోమ్, శ్రీ సత్య విజయ ఆర్థో అండ్ మెటర్నిటీ, శ్రీ కిరణ్ మెటర్నిటీ అండ్ సర్జికల్, ప్రతిభ నర్సింగ్ హోమ్, మల్లిక మెటర్నిట్, ఓం సాయి హాస్పటల్, నందిని మెటర్నిటీ నర్సింగ్‌హోమ్, శ్రీనివాస నర్సింగ్ హోమ్, సుగుణ డెంటల్ అండ్ మెటర్నిటీ హాస్పటల్, ధర్మరాజు హాస్పిటల్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇవ్వేగాక ఇంకా ఏమైనా ఆసుపత్రులు ఉన్నాయా అనేది తేలాల్సి ఉంది. తనిఖీలు చేయనున్న కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు, ఆసుపత్రి నిర్వాహకులకు నమస్తే తెలంగాణ ఫోన్ చేసి వివరణ కోరే ప్రయత్నం చేసినప్పటికీ వారు స్పందించ లేదు.

### ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం

*జిల్లాలో ఎక్కువ సీ సెక్షన్ డెలివరీలు చేసే హాస్పిటల్స్‌ను గుర్తించాం. ఆ ఆసుపత్రుల్లో నేటి నుంచి ఆడిట్ చేస్తున్నాం. ఆసుపత్రులకు వెళ్లి వివరాలు సేకరిస్తే వచ్చే పేషెంట్లకు ఇబ్బంది ఉంటుందనే ఉద్దేశంతో రిపోర్ట్ పట్టుకొని ఐడీవోసీ కార్యాలయానికి రావాలని సూచించాం. ముగ్గురు ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో మూడు బృందాలను ఏర్పాటు చేశాం. ఆయా ఆసుపత్రుల రికార్డులను తనిఖీ చేసి ఎందుకు సీ-సెక్షన్ ఎక్కువ చేయాల్సి వచ్చిందనే కారణాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం.*

*- సుబ్బారాయుడు, మంచిర్యాల డీఎంహెచ్‌వో*

# సత్వర చికిత్సతో కుష్ఠును నివారించవచ్చు

**డీసీఎంవో శివకుమార్**


మాట్లాడుతున్న డీసీఎంవో శివకుమార్

చెన్నూర్, ఫిబ్రవరి 5 : సత్వర చికిత్సతో కుష్ఠు వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని డీసీఎంవో శివకుమార్ అన్నారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి మెకో, లెప్రి బ్యాక్టీరియాల వల్ల వస్తుందని, ఇది ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుందన్నారు. నరాలకు వ్యాధి సోకితే కాళ్లు.. చేతులకు తిమ్మిర్లు, బలహీనత, స్పర్శ కోల్పోవుటవంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. చర్మంపై ఏ రకమైన మచ్చలున్నా దగ్గరలోని ఆరోగ్య కార్యకర్తలు, డాక్టర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చికిత్స లభిస్తుందన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధిని పూ ర్తిగా నిర్మూలిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనాగిల్డా, వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు మహేశ్, జగన్నాథుల శ్రీను, కో-ఆప్షన్ సభ్యు డు అయూబ్ ఖాన్, డీపీఎంవో రాఘవయ్య, ఎంపీహెచ్‌వో జగదీష్, వైద్య, మున్సిపాలిటీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.




















